క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు చేపట్టాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం మానకొండూర్‌లోని తూర్పు దర్వాజ నుంచి పాదయాత్రగా తరలివచ్చి తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి వేగురుపల్లి, చెంజర్ల నుంచి పచ్చునూర్, ఊటూర్‌ వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు, అధికారులు రోడ్డు మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, లక్ష్మణాచారి, ప్రభాకర్‌గౌడ్, భూమయ్య, కోటేశ్వర్, వరప్రసాద్, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

బీసీల పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు

చొప్పదండి: ముస్లింలను బీసీ జాబితా నుంచి తొలగిస్తే బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ సిద్ధంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌ గౌడ్‌ అన్నారు. మండలంలోని ఆర్నకొండలో గురువారం తిరంగా ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించడానికి బీజేపీ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తుందని, వారం రోజులు కార్యకర్తలు తిరంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. యువతలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మొగిలి మహేశ్, బైరగోని కిట్టుగౌడ్, మొగిలి సారయ్య, పెద్ది వీరేశం, కుమార్‌బు, సురేశ్, అంజయ్య, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో అడ్మిషన్‌ పోస్టర్‌ను కేంద్రం సమన్వయ కర్త డా.రాజేంద్రం ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆవిష్కరించారు. ఓపెన్‌ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునేవారు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యం కోసం సమత–నిపుణ, వి హబ్‌ వంటి పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా పని చేసుకుంటూ చదువుకునే అవకాశం కల్పించిందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ ఓదెల్‌కుమార్, అధ్యాపకులు గణేశ్, కిరణ్‌కుమార్, శ్యామల, రాజకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవిప్రకాశ్, రమేశ్, సుధాకర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో నిర్మించిన శ్రీ దుర్గాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం కొనసాగాయి. రెండో రోజు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో రామడుగు సింగిల్‌ విండో చైర్మన్‌ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కవిత, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ వీర్ల ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రావు, సరోజన, వెలిచాల ధార్మిక ట్రస్ట్‌ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల నిరసన



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: యూరియా కొరత తీర్చకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. ఎరువుల కొరతను నిరసిస్తూ మండల కేంద్రంలోని రైతువేదిక ఎదుట పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం బైక్‌ ర్యాలీ చేపట్టి ఏవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో రైతులకు యూరియా కొరత రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాస్తున్నా పాలకులకు పట్టింపు లేదని, చేతకాని పాలనతోనే రాష్ట్రంలో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతిపక్ష నాయకులపై నిందలు వేయడం మానుకొని రైతులు, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. విధుల్లో సమయపాలన పాటించని వ్యవసాయ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

పుష్కర కాలానికి మోక్షం

- ఆదర్శనగర్‌లో తీరనున్న మురుగునీటి సమస్య
- కచ్చకాలువల ఏర్పాటుకు అధికారుల చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





మానకొండూర్‌: మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఎట్టకేలకు మురుగునీటి సమస్యకు మోక్షం లభించింది. గ్రామ పంచాయితీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా కచ్చకాలువలు ఏర్పాటు చేయడంతో సమస్య తీరినట్టే. రెండు రోజులుగా కచ్చకాలువల ఏర్పాటు చేసే పనిలో అధికారులు నిమగ్నమవడంతో ఆదర్శనగర్‌ కాలనీతో పాటు ముంజంపల్లి రోడ్డువెంట ఉన్న ఇళ్ల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శనగర్, ముంజంపల్లికి వెళ్లే రోడ్డులో సుమారు నాలుగు వందల ఇళ్లు ఉన్నాయి. ఇళ్ల నుంచి మురుగునీరు వెళ్లేలా పాలకులు సుమారు 12 సంవత్సరాల కిందట మురుగుకాలువలు నిర్మించారు. మురుగునీరు వెళ్లేలా మురుగుకాలువల నిర్మాణం చేపట్టిన రోడ్డు వెంట ఉన్న కొందరి నిర్వాకం వల్ల డ్రైయినేజీ పూడుకుపోయి మురుగునీరు నిలిచిపోయేది. మురుగునీటితో ప్రజలు నానాఇబ్బందులు పడ్డారు. దుర్వాసనతో పాటు దోమల బారిన పడి అనారోగ్యానికి గురయ్యారు. మురుగునీరు పేరుకుపోయిందని కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బ్యాంకు సమీపంలో డ్రైనేజీ నిండి మురుగునీరు రోడ్డు, ఇళ్ల సమీపంలో పారడంతో ప్రజలు నానాఇబ్బందులు పడ్డారు. ఇటీవల కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పేరుకుపోయిన మురుగునీరు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. డీపీవో ఆదేశాల మేరకూ ఎంపీడీవో వరలక్ష్మీ, ఎంపీవో కిరణ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి కరీంనగర్‌ వరంగల్‌ రోడ్డుకు ఇరువైపులా కచ్చకాలువలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్‌ చేయగా రోడ్డు యాభై ఫీట్ల దూరంలో జేసీబీ సాయంతో కాలువలు తీయిస్తున్నారు. దీంతో ఆదర్శనగర్, ముంజంపల్లికి వెళ్లే రోడ్డులోని ఇళ్ల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు ఎస్సీకాలనీలో మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిరుపయోగంగా ఉన్న పాత వ్యవసాయబావితో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. బావి చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో బావి ఆనవాళ్లు కనిపించడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి బావి చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వర్‌రావు, ఎంపీడీవో, ఇల్లందకుంట నం.98494 30892

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్‌ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

నులిపురుగుల నివారణకు అల్బెండజోల్‌



జమ్మికుంట: సమావేశంలో డాక్టర్లు, సిబ్బంది

జమ్మికుంట: జాతీయ నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని హుజూరాబాద్‌ డివిజన్‌ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ప్రాథమిక, గురుకుల, అంగన్‌వాడీ, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లోని 19 సంవత్సరాల లోపు పిల్లందరికి అల్బెండజోల్‌ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. తప్పిన వారికి 18న మరో విడతలో పంపిణీ చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఈవో హేమలత, డాక్టర్‌ చందన, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ రమాదేవి, హెల్త్‌ అసిస్టెంట్‌ నరేందర్, మున్సిపల్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మహేశ్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం: ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు అల్బెండజోల్‌ మాత్రలు వేయాలని వైద్యాధికారి శ్రావణ్‌ సూచించారు. కేశవపట్నం రైతువేదికలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 11న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీమతి, తహసీల్దార్‌ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఎంఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గన్నేరువరం: మేఘనకు బహుమతి అందిస్తున్న కలెక్టర్‌ పమేలా సత్పతి

జాతీయ చేనేత దినోత్సవం

చొప్పదండి: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి తరుణ్‌కుమార్‌ ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో నిలిచాడు. ఈసందర్భంగా కలెక్టర్‌ పమేలా సత్పతి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. విద్యార్థిని హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, ట్రైనర్‌ చంద్రశేఖర్‌ అభినందించారు. మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు చేనేత బాట నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను చేనేత కార్మికుల ఇంటికి తీసుకెళ్లి చేతి మగ్గం ద్వారా వస్త్రాలను తయారు చేసే విధానం చూపించారు. పట్టణంలోని నేతన్న విగ్రహం వద్ద చొప్పదండి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో దండె రాజయ్య, ఇప్పనపల్లి సాంబయ్య, వల్లాల క్రిష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.



నేతన్న విగ్రహం వద్ద కార్మికులు



వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

గన్నేరువరం: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని హ్యాండ్లూమ్స్‌ ప్రాధాన్యతపై జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పత్తి మేఘన ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. కలెక్టర్‌ ఆడిటోరియంలో మేఘనకు కలెక్టర్‌ పమేలా సత్పతి బహుమతి అందజేసి శాలువాతో సన్మానించారు. ఎంఈవో రామయ్య, గైడ్‌ ఉపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చేనేత దినోత్సవం సందర్భంగా టీచర్లు చేనేత దుస్తులు ధరించి స్కూల్‌కు హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. చేనేత దుస్తులు ధరించడంతోపాటు వృత్తిని ప్రోత్సహించాలని హెచ్‌ఎం నీరజ సూచించారు.

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని శాలపల్లి గ్రామంలో భక్త మార్కండేయ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతన్న విగ్రహానికి సంఘం బాధ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేముల రమేష్, జడల చిరంజీవి, సంగెం సత్యనారాయణ, చిలుకమారి శ్రీనివాస్, పోతురాజు సంపత్, ఆడెపు పోషం తదితరులున్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

జమ్మికుంట: పట్టణంలో గాంధీచౌక్‌ సమీపంలోని భవనంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్‌ పుల్ల సుజాత గురువారం ప్రారంభించారు. గతంలో హుజూరాబాద్‌ మండలంలోని ఎల్లబోతారం, ఇల్లందకుంట, సిరిసేడులో పలువురికి శిక్షణ ఇచ్చి సబ్సిడీపై మిషన్లు అందజేశామన్నారు. జమ్మికుంట కేంద్రంగా ప్రతి గ్రామంలోని మహిళలకు శిక్షణ, సబ్సిడీపై నాణ్యమైన కుట్టు మిషన్‌ అందజేస్తామన్నారు. 16 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు ఫొటో, ఆధార్, పాన్‌ కార్డుల జిరాక్స్‌లతో జమ్మికుంటలోని సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో మండల వాలంటరీ, శిక్షకురాలు అకినపల్లి విజయ, మహిళలు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ



చిగురుమామిడి: ఇందుర్తిలో సైకిళ్లు పంపిణీ

గంగాధర: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ జన్మదినం పురస్కరించుకొని పీఎం మోదీ గిఫ్ట్‌గా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గురువారం మండలంలోని గర్శకుర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకులు సైకిళ్ల పంపిణీ చేశారు. నాయకులు వైద రామానుజం, పెరుక శ్రావణ్‌కుమార్‌ మాట్లాడుతూ... విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. పదిలో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు ప్రభుత్వ బడికి వెళ్లేలా ప్రోత్సహించడానికే బండి సంజయ్‌కుమార్‌ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి ప్రభుత్వ జెడ్పీపాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకులు సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రద, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళిమనోహర్, మండల ఉపాధ్యక్షుడు రఘునాథాచారి, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, ఓబీసీ మోర్చ కార్యదర్శి నడిగొట్ల కిరణ్, మండల నాయకులు కొంకటి లక్ష్మణ్, కూన సంతోష్‌ పాల్గొన్నారు.



ఇల్లందకుంట: వేడుకల్లో విద్యార్థులు, టీచర్లు

ముందస్తు రాఖీ వేడుకలు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ముందస్తు రాఖీ పండుగ జరుపుకున్నారు.

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రాఖీపండుగ జరుపుకున్నారు. బీజేపి జిల్లా కౌన్సిల్‌మెంబర్‌ గుత్తికొండ రాంబాబు బాలబాలికలకు రాఖీలు కట్టించారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు రాఖీ వేడుకలు జరుపుకున్నారు.



చొప్పదండి: ఆర్నకొండలో...

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



ఇల్లందకుంట: మాట్లాడుతున్న అధికారులు

ఇల్లందకుంట: ఇల్లందకుంట గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను లక్ష్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌ సూపర్‌వైజర్‌ శ్యామల, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ జ్యోతి పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, తల్లులు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

చొప్పదండి: పట్టణ ప్రజలు సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్‌ కమిషనర్‌ కీర్తి నాగరాజు అన్నారు. గురువారం పురపాలక సంఘంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తల్లిపాల ప్రాముఖ్యత గుర్తించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనాల ద్వారా తరలించేందుకు సహకరించాలని కోరారు. హెల్త్‌ సూపర్‌వైజర్‌ శ్రీదేవి మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాలు, క్యాన్సర్‌ ముందస్తు పరీక్షలు, సమయానికి వ్యాక్సిన్లపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్‌ అనిత పాల్గొన్నారు.

గంగాధర: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్‌ సీడీపీవో నర్సింగారాణి, వైద్యాధికారి శిరీష సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఆరునెలల పాటు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. తల్లిపాలతోకలిగే లాభాలు, డబ్బా పాలతో కలిగే నష్టాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ రేణుక, అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్స్‌ లక్ష్మి, ఎల్లమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• హుజూరాబాద్‌లో కార్డెన్‌ సెర్చ్‌

హుజూరాబాద్‌: పట్టణంలోని మామిండ్లవాడ కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహించారు. పోలీస్‌ కమిషనర్‌ గౌస్‌ ఆలం ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు అడిషనల్‌ డీసీపీ వెంకటరమణ తెలిపారు. సరైన పత్రాలు లేని 55 బైక్‌లు, 9 ట్రాక్టర్లు, 7 ఆటోలు, 3 కార్లు, 2 బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించామన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అద్దెకు ఇచ్చే ముందు గుర్తింపు పత్రాలు పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్‌ 100 ఫోన్‌ చేయాలని సూచించారు. ఏసీపీ వాసంశెట్టి మాధవి, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

• దాతల చేయూత

జమ్మికుంట: మున్సిపల్‌ పరిధిలోని సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు కెనడాలో స్థిరపడిన వీణవంక మండలానికి చెందిన కిరణ్‌కుమార్‌ తండ్రి అనుమండ్ల సమ్మిరెడ్డి జ్ఞాపకార్థంగా రూ.లక్ష విలువ చేసే ఆటోను బహూకరించారు. స్థానిక పాఠశాలలో దాత కూతురు అనూష చేతుల మీదుగా ఆటోను ప్రారంభించారు. నిర్వాహకుడు సూత్రపు బుచ్చిరాములు దివ్యాంగులకు ఆటో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

• అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు

చిగురుమామిడి: మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి రమశ్రీ తెలిపారు. గురువారం చిగురుమామిడి రైతువేదికలో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందొద్దని, ప్యాక్స్, డీసీఎంఎస్, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా ఉందని, అవసరం మేరకే కొనుగోలు చేయాలని, అక్రమనిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

• స్టీల్‌ ప్లేట్లు పంపిణీ

శంకరపట్నం: మండలంలోని వెంకటేశ్వర్లపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం స్టీల్‌ప్లేట్లలో భోజనం చేసి, స్టీల్‌ బాటిళ్లలో మంచినీరు తాగారు. ప్లాస్టిక్‌ వాడకం తగ్గించేందుకు ఎకో క్లబ్‌ ఆధ్వర్యంలో వాటర్‌ బాటిళ్లు, స్టీల్‌ ప్లేట్లు ఉపాధ్యాయుడు లక్కాకుట కోటేశ్వర్‌రావు అందించారు. ప్లాస్టిక్‌ వాడకం తగ్గించాలని సూచించారు.

• వినియోగదారుల సదస్సు

వీణవంక: మండలంలోని చల్లూరు సెక్షన్‌ పరిధి ఎల్బాక విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్‌ వినియోగదారుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్‌ వేణుగోపాలాచారి హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పలువురు రైతులు సమస్యలను చైర్‌పర్సన్‌ దృష్టికి తీసుకెళ్లారు.

• ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు

వీణవంక: మండలంలోని బేతిగల్‌ గ్రామంలో 33/11కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించగా విద్యుత్‌ శాఖ డీఈఈ(ఎంఆర్‌టీ) చంద్రమౌళి గురువారం ప్రారంభించారు.

• నియామకం

ఇల్లందకుంట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఇల్లందకుంట మండలశాఖను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నియమించారు. మండల ఉపాధ్యక్షుడిగా చరాల వైకుంఠం, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడిగా ఎండీ లాల్‌ మహ్మద్, కార్యవర్గ సభ్యులుగా బండి మల్లయ్య, మర్రి భూమిరెడ్డి, రాం రాజయ్య, రేణిగుంట్ల సారయ్య, ఎడ్ల చిరంజీవిని ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు.

• ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని హిమ్మత్‌నగర్‌ మాజీ సర్పంచు పొత్తూరి బాబు కుటుంబానికి మైత్రి గ్రూప్స్‌ చైర్మన్‌ కొత్త జయపాల్‌రెడ్డి ఆర్థికసాయం చేశారు. బాబు తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న జయపాల్‌రెడ్డి మిత్రమండలి సభ్యుల ద్వారా రూ.పదివేలు అందజేశారు.

• కళాశాలల్లో వసతులు కల్పించాలి

హుజూరాబాద్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో కనీస వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాడిశెట్టి అభిలాశ్‌ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

• సహాయ నిధి సేకరణ

శంకరపట్నం: క్యూబాపై అమెరికా ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కేశవపట్నంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘీభావ నిధి సేకరించారు. అమెరికా తీరు సరికాదన్నారు.

• విద్యార్థుల ప్రతిభ

గంగాధర: ఇండియన్‌ టాలెంట్‌ ఒలింపియాడ్‌ గత విద్యాసంవత్సరం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మండలంలోని గర్శకుర్తి సరస్వతీ హైస్కూల్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నలుగురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, ముప్పై మంది విద్యార్థులు ఎక్సలెన్స్‌ అవార్డులు సాధించారని స్కూల్‌ కరస్పాండెంట్‌ మిట్టపల్లి రాజశేఖర్‌ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో, ప్రిన్సిపాల్‌ మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

• భూ కబ్జాదారుల నుంచి రక్షించాలి

హుజూరాబాద్‌: జమ్మికుంట మున్సిపల్‌ పరిధి రామన్నపల్లెకు చెందిన యువకుడు పురెళ్ల సురేష్‌ తన కుటుంబానికి భూ కబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందని తెలిపాడు. గురువారం పట్టణంలో మాట్లాడారు. భూమికి అన్నిరకాల అనుమతులు ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణం అడ్డుకుంటున్నారని ఆరోపించాడు. అధికారులు, పోలీసులు ఇల్లు నిర్మించుకోవడానికి సహకరింకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు.

• గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి: గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం అమరుల యాదిలో చైతన్యయాత్ర సుందరగిరికి చేరుకుంది. గీత కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య, మాజీ ఎంపీ ధర్మభిక్షం ఆశయసాధనకు కృషిచేస్తామన్నారు. యాత్ర 18న కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు.

• తాడికల్‌ గ్రామంలో విషాదం

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన గొట్టె నర్సయ్య టెలికాం డిపార్ట్‌మెంట్‌లో పని చేసి రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఆయనకు భార్య పద్మ, ముగ్గురు పిల్లలు శ్రావణి, శ్రావ్య, శివకృష్ణ సంతానం. ప్రేమ వివాహం చేసుకున్న శ్రావ్య ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. మరో కూతురు శ్రావణి మగబిడ్డకు జన్మనివ్వగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం పసికందు మృతి చెందింది. శ్రావ్య ఆత్మహత్య, మరో కూతురుకు పుట్టిన పసికందు మృతితోతో ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోతోంది. మరో వైపు పద్మ తండ్రి వెంకటయ్య చావు బతుకుల మధ్య ఉన్నట్లు తెలిసింది.

• పాస్‌బుక్‌ జిరాక్స్‌లు స్వీకరణ

శంకరపట్నం: తాడికల్‌ సహకార సంఘంలో యూరియా బస్తాల కోసం రైతులు పట్టాదారు పాస్‌బుక్‌ జిరాక్స్‌లు అందించారు. 4 రోజులుగా సంఘం పరిధిలోని రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతుల నుంచి విండో సిబ్బంది జిరాక్స్‌లు తీసుకున్నారు.

కారు, బైక్‌ ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు

జమ్మికుంట: అబాది జమ్మికుంట శ్మశనవాటిక సమీపంలో కారు, బైక్‌ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం కరీంనగర్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి...

హుజూరాబాద్‌: ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. హుజూరాబాద్‌ నుంచి జమ్మికుంటకు ఆరుగురు వ్యక్తులతో వెళ్తున్న ఆటో మండలంలోని గొల్లపల్లి వద్ద ముళ్ల కంపను తప్పించే క్రమంలో బోల్తాపడింది. 108లో హుజూరాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గొలుసు అపహరణ

చిగురుమామిడి: బొమ్మనపల్లి శివారులో హుస్నాబాద్‌ ఆర్‌అండ్‌బీ రహదారిపై హుస్నాబాద్‌ వాసి కొండూరి ధనలక్ష్మి అనే మహిళ సైదాపూర్‌ వెళ్తుండగా.. ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఎత్తుకెళ్లాడు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు సంఘటన జరిగింది. పలువురు అక్కడ గుమిగూడి విషయాన్ని తెలుసుకున్నారు. తాను ఎంత మొత్తుకున్నా వినకుండా తన మెడలోంచి తస్కరించాడని వివరించింది. పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఆమె బంధువులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.